## ముగిసిన వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు


బ్రహ్మోత్సవాల్లో సుదర్శనస్వామికి చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

**కొత్తపేట, జూన్ 6(ఆంధ్రజ్యోతి):** సుదర్శనస్వామికి చక్రస్నానఘట్టంతో శుక్రవారం స్నేహపురికాలనీ పద్మావతీ గోదాసమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిసాయి. బ్రహ్మోత్సవాల్లో సప్తావరణ సేవలో స్నేహపురి వేంకటేశ్వరస్వామి ఉభయ దేవేరులతో దర్శనమిచ్చారు. స్వామివార్లకు అర్చకస్వాములు విశేష పూజలు నిర్వహించారు. సప్తావరణ సేవలో వీణ, పిల్లనగ్రోవి తదితర వాయిద్యాల శాస్త్రీయ సంగీతం, గానం, కళాకారిణుల శాస్త్రీయ నృత్యం ఏర్పాటు చేశారు. ప్రాతః కాలార్చన బాలభోగ నివేదన తర్వాత స్వామి వారికి అష్టోత్తర శత కలశాభిషేకం వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం పుష్కరిణిలో అర్చక స్వాములు వేదమంత్రాల మధ్య సుదర్శనస్వామికి చక్రస్నానం నిర్వహించారు. పల్లకీసేవలో భక్తులు ఏడు మార్లు చేపట్టిన ఆలయ ప్రదక్షిణ కనులపండువగా జరిగింది. భక్తుల గోవిందనామచరణల మధ్య స్వామివారు ఆలయ ప్రాంగణంలో ఉభయ దేవేరులతో ఊరేగారు.


హనుమాన్ ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న బ్రాహ్మణులు

## హనుమాన్ ఆలయానికి భూమిపూజ

**హయత్‌నగర్, జూన్ 6(ఆంధ్రజ్యోతి):** హనుమగల్ హయత్‌నగర్‌లోని చారిత్రక హనుమాన్ ఆలయ జీర్ణోద్ధరణకు హయత్‌నగర్ గ్రామ పెద్దలు పూనుకున్నారు. అందులో భాగంగా కొత్తగా నిర్మించే ఆలయానికి శుక్రవారం శేఖర్ పంతులు పర్యవేక్షణలో భూమిపూజ నిర్వహించారు. పటిష్టమైన వాస్తు ఆధారంగా ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, గ్రామపెద్దలు గుమ్మి నర్సింహారెడ్డి, కళ్లెం బాల్‌రెడ్డి, నక్క ప్రభాకర్‌గౌడ్, కళ్లెం రవీందర్‌రెడ్డి, నక్క దర్శన్‌గౌడ్, కళ్లెం శంకర్‌రెడ్డి, చెన్నగోని రమేష్‌గౌడ్, నక్క వెంకటేశ్‌గౌడ్, గజ్జి నర్సింహయాదవ్, నక్క రవీందర్‌గౌడ్, ఎర్ర వెంకటేశ్, చెన్నగోని శ్రీధర్‌గౌడ్, ఉగాది ఎల్లప్ప, వస్పరి బలరాం, ఆకిటి బాల్‌రాజ్ ముదిరాజ్, మల్లేష్‌ముదిరాజ్, సునీల్‌గౌడ్, శ్రీను, బాలకృష్ణయాదవ్ పాల్గొన్నారు.

## ఎన్‌ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక

**అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 6(ఆంధ్రజ్యోతి):** కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు(ఎన్‌ఎంఎంఎస్) మండలంలోని మజీద్‌పూర్ జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన 15మంది విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ఎంపిక అయిన విద్యార్థులకు 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు కేంద్ర ప్రభుత్వమే ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. ప్రతిభ ఉన్న పేద విద్యార్థులు ఆర్థిక పరిస్థితులు అనుకూలించక మధ్యలోనే చదువు మానేస్తున్నట్లు గుర్తించిన కేంద్ర ప్రభుత్వం జాతీయ ప్రతిభాన్వేషణ పరీక్షలను నిర్వహించి ఉపకార వేతనాలు అందిస్తుందని తెలిపారు. ఎక్కువ మంది విద్యార్థులు సెలెక్ట్ అయిన స్కూల్‌గా మజీద్‌పూర్ రంగారెడ్డి జిల్లాలో రెండవ స్థానంలో నిలిచిందని ఆయన తెలిపారు.


లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న భూపాల్‌రెడ్డి తదితరులు

## సీఎం సహాయనిధి చెక్కులు అందజేత

**సరూర్‌నగర్, జూన్ 6(ఆంధ్రజ్యోతి):** మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని వివిధ డివిజన్లకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను శుక్రవారం జిల్లెలగూడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కౌన్సిల్ బీఆర్‌ఎస్ మాజీ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే సబితారెడ్డి అందుబాటులో లేకపోవడంతో ఆమె ఆదేశాల మేరకు తాము చెక్కులు అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మీర్‌పేట్ శాఖ అధ్యక్షుడు కామేశ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ బొక్క రాజేందర్‌రెడ్డి, నాయకులు సిద్దాల బీరప్ప, మేకల రవీందర్‌రెడ్డి, బాల్‌రాజ్, అంజయ్య, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సహదేవ్, అర్జున్ పాల్గొన్నారు.

## సెల్‌టవర్ నిర్మాణంపై గ్రామస్థుల ఆందోళన

**అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 6(ఆంధ్రజ్యోతి):** మండలంలోని లష్కర్‌గూడ గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న సెల్‌టవర్ నిర్మాణంపై గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామపంచాయతీ సమీపంలో జడ్పీరోడ్డు పక్కన, జనావాసాల మధ్యలో కొన్ని రోజుల నుంచి ఓ కంపెనీకి చెందిన సెల్ టవర్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అయితే సెల్‌టవర్ నిర్మాణంపై గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. జనావాసాల మధ్యలో ఏర్పాటు చేస్తున్న టవర్ రేడియేషన్ ప్రభావంతో వృద్ధులు, చిన్న పిల్లలు అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉన్నదని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఇళ్ల మధ్యలో కాకుండా గ్రామ శివారులో ఏర్పాటు చేసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. అయితే టవర్ నిర్మాణంపై పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టవర్ నిర్మాణానికి ప్రభుత్వ అనుమతులు కూడా లేవని వారు తెలిపారు. అయినా పంచాయతీ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తూ టవర్ నిర్వాహకులకు సహకరిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే నిర్మాణ పనులు ఆపేయాలని లేని పక్షంలో గ్రామ ప్రజలంతా అక్కడ ధర్నా చేస్తామని హెచ్చరించారు. వెంటనే పనులు నిలిపివేయాలని.. లేని పక్షంలో ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని గ్రామస్థులు తెలిపారు.

## సీసీ రోడ్డు ప్రారంభం

**వనస్థలిపురం, జూన్ 6(ఆంధ్రజ్యోతి):** వనస్థలిపురం డివిజన్ నాగార్జున కాలనీలో రూ.40.40లక్షలతో నూతనంగా భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులను చేపట్టారు. పనులు పూర్తి కావడంతో శుక్రవారం టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి కాలనీవాసులతో కలిసి సీసీ రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, కవిత, నాగార్జున కాలనీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, క్రిస్టియన్ కాలనీ అధ్యక్షుడు హరింధర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న మార్కెట్ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్, దాసు

## జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ ర్యాలీ

**సైదాబాద్, జూన్ 6(ఆంధ్రజ్యోతి):** జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ ర్యాలీని ఐఎస్ సదన్ డివిజన్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు నాగరిగారి దాస్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ బీజేపీ పాలనలో రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ, సమానత్వం, హక్కులను కాలరాస్తూ, మహాత్మా గాంధీ చూపిన అహింస, శాంతి సిద్ధాంతాలను విస్మరిస్తుందన్నారు. జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ నినాదంతో పెద్దఎత్తున ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నేతలు బాలరాజు, రవిరాజు, వెంకటమ్మ, అలివేలు పాల్గొన్నారు.

# బక్రీద్‌కు సర్వం సిద్ధం

- ముస్తాబైన మసీదులు, ఈద్గాలు
- జోరుగా సాగుతున్న గొర్రెలు, మేకల విక్రయాలు


అక్బర్‌బాగ్ ఈద్గాలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బలాల

**సైదాబాద్, జూన్ 6(ఆంధ్రజ్యోతి):** బక్రీద్ ప్రత్యేక ప్రార్థనలకు సైదాబాద్, మాదన్నపేట, అక్బర్‌బాగ్‌లలో అధికారులు ఈద్గాలను ముస్తాబు చేశారు. ముస్లింలు నిర్వహించే సామూహిక ప్రార్థనల కోసం మసీద్, ఈద్గాల వద్ద జీహెచ్‌ఎంసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. అక్బర్‌బాగ్, మాదన్నపేట ఈద్గాలలో జరిగే సామూహిక ప్రార్థనల్లో సుమారు 20వేలకు పైగా ముస్లింలు ప్రార్థనలు చేసుకోవడానికి వీలుగా సదుపాయాలను కల్పిస్తున్నారు. వర్షం కురిసినా ఇబ్బందులు రాకుండా వాటర్ ప్రూఫ్ టెంట్‌లు ఏర్పాటు చేశారు. ప్రార్థనలకు ముందు కాళ్లు, చేతులు కడుగుకోవడానికి వీలుగా ప్రత్యేక నీటి వసతిని కల్పిస్తున్నారు. త్యాగాలకు ప్రతీకగా ఈ పర్వదినాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తారు. ఈ రోజు ప్రతి ముస్లిం ఖుర్బానీ ఇవ్వటానికి ఆరాటపడుతుంటారు. ఇందుకు వారు పొట్టేళ్లు, గొర్రెలు, మేకలను ఖరీదు చేయడానికి సిద్ధమయ్యారు. త్యాగానికి ప్రతీకగా నిలిచే ఈ బక్రీద్ పండుగ కోసం నగర శివారు ప్రాంతాల నుంచి గొర్రెలు, మేకలు, పొట్టేళ్లు, పాతబస్తీకి తరలించారు. ముఖ్యంగా అక్బర్‌బాగ్, చంచల్‌గూడ జైలు రోడ్డు పరిసర ప్రాంతాలు వినియోగదారులతో రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి.

**బ్యాగుల పంపిణీ**

గొర్రెలు, మేకల వ్యర్థాలు, చెత్తను రోడ్లపై వేయకుండా ఉండేందుకు ప్లాస్టిక్ బ్యాగులను జీహెచ్‌ఎంసీ సిబ్బంది సైదాబాద్, మాదన్నపేట, అక్బర్‌బాగ్‌లలో పంపిణీ చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు అందరూ సహకరించాలని కోరారు. ముందు జాగ్రత్తగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. చెక్‌పోస్టులు ఏర్పాటు గోవులు తరలించకుండా పటిష్ఠ చర్యలు చేపట్టారు.


మాదన్నపేట ఈద్గా

**ఈద్గాలను సందర్శించిన ఎమ్మెల్యే**

సైదాబాద్ ఉజలేషా, అక్బర్‌బాగ్ ఈద్గాలను అధికారులతో కలిసి మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల సందర్శించారు. ఈద్గా వద్ద ఏర్పాట్లను కమిటీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. సామూహిక ప్రార్థనలకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

## భూ భారతితో పెండింగ్ భూ సమస్యలు పరిష్కారం

**రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి**



రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ ఉద్యమకారులు

**అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 6(ఆంధ్రజ్యోతి):** పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలోని కుంట్లూర్, హతిగూడలో అబ్దుల్లాపూర్‌మెట్ రెవెన్యూ అధికారులు శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుల్లో తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి పాల్గొని భూ యజమానుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కుంట్లూర్ నుంచి 15 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూభారతితో భూ సత్వర పరిష్కారం లభించనుందన్నారు. పెండింగ్ భూ సమస్యలు పరిష్కరించుకునేందుకు రెవెన్యూ సదస్సు చక్కటి వేదిక అన్నారు. చిన్న చిన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తున్నానని పేర్కొన్నారు. భూ సమస్యలు ఉన్న యజమానులు సదస్సుకు హాజరై దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు.

**తెలంగాణ ఉద్యమకారుల వినతి..**

రెవెన్యూ సదస్సులో పాల్గొన్న తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డికి ఉమ్మడి హయత్‌నగర్ మండలానికి చెందిన తెలంగాణ ఉద్యమకారులు వినతి పత్రం సమర్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలాన్ని కేటాయిస్తామన్న హామీని నెరవేర్చాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఉద్యమకారులకు ఇంటి స్థలాల మంజూరుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డీటీ కార్తీక్‌రెడ్డి, ఉద్యమకారులు జెనిగే విష్ణువర్ధన్, కొంతం యాదిరెడ్డి, జోర్క రాముముదిరాజ్, ముఖేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడలకు ప్రోత్సాహమిస్తున్న ప్రభుత్వం

**టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్**


వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్

**ఎల్‌బీనగర్, జూన్ 6(ఆంధ్రజ్యోతి):** తెలంగాణలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు ప్రోత్సాహమిస్తున్నదని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన వేసవి శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం శుక్రవారం జరిగింది. అథ్లెటిక్స్, క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, స్విమ్మింగ్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, స్కేటింగ్ తదితర క్రీడాంశాలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేశ్వర్‌రావుతో కలిసి మెడల్స్ అందజేసిన ఆయన వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలకు ప్రభుత్వం ప్రత్యేక యూనివర్సిటీని ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించిందన్నారు. సరూర్‌నగర్ స్టేడియంలో అదనపు సదుపాయాలు కల్పించేందుకు ముఖ్యమంత్రితో పాటు కలెక్టర్‌తో మాట్లాడి చర్యలు తీసుకుంటానన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కోచ్‌ల కొరత ఉందని రిటైర్ అయిన వాళ్ల స్థానంలో కొత్త వారిని నియమించే విషయంలో ప్రభుత్వంతో మాట్లాడుతానన్నారు. అంతే కాకుండా సరూర్‌నగర్ స్టేడియంలో జిమ్ పరికరాలు ఏర్పాటు చేయిస్తానన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి, కోచ్ అసోసియేషన్ అధ్యక్షుడు దంతి వినోద్‌కుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, కోచ్‌లు ఎంవీ ఫణికిషోర్, స్వర్ణలత, రవీందర్, సైదులు, సాయిరెడ్డి, సమీరా బేగం, రమాదేవి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బెడ్డ సత్యనారాయణ, పన్యాల జైపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి


గ్రామసభలో మాట్లాడుతున్న డిప్యూటీ ఈవో రాధాకృష్ణ

**చాదర్‌ఘాట్, జూన్ 6(ఆంధ్రజ్యోతి):** బడిఈడు పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సైదాబాద్ మండల డిప్యూటీ ఈవో రాధాకృష్ణ తల్లిదండ్రులకు, కుటుంబీకులకు విజ్ఞప్తి చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మూసారాంబాగ్ సంజీవయ్యనగర్ బస్తీలోని బాగ్‌ముసారిమో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన గ్రామసభకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో వేలాది రూపాయల డొనేషన్లను చెల్లించాల్సి వస్తుందని, ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా అడ్మిషన్‌తో పాటు నాణ్యమైన విద్యాబోధన, క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు బోధిస్తారని వివరించారు. అడ్మిషన్ ఉచితంగా పొందడంతో పాటు యూనిఫాం, పాఠ్యపుస్తకాలతోపాటు నోట్ బుక్‌లను కూడా ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శశికళ అధ్యక్షతన జరిగిన గ్రామసభలో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట ఈనెల 19వ తేదీ వరకు జరుగుతుందని వివరించారు.

**అబ్దుల్లాపూర్‌మెట్ :** ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని బాటసింగారం జడ్పీహెచ్‌ఎస్‌లో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని హెచ్‌ఎం యాదగిరి కోరారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యాబోధనతో పాటు స్కూల్ యూనిఫాం, పుస్తకాలు, ఉచిత భోజనం ఉంటుందన్నారు. కవాడిపల్లి జడ్పీహెచ్‌ఎస్ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం చేపట్టారు. పంచాయతీ సెక్రెటరీ రాంబాబు, గ్రామస్థులు గౌరిశంకర్‌చారి, వెంకటేష్, సుజాత, పట్టాబిరామాచారి, శ్రీకాంత్‌రెడ్డి, నవీన్, వెంకటేష్ పాల్గొన్నారు.


సైదాబాద్‌లో బడిబాటను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ అరుణారెడ్డి

**సైదాబాద్ :** సైదాబాద్ ఆర్యసమాజ్ పాఠశాల నుంచి శుక్రవారం బడిబాటను కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డి ప్రారంభించారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించండని పిలుపునిచ్చారు. మలక్‌పేట ప్రభుత్వ పాఠశాలలో ర్యాలీని ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి ప్రారంభించారు. శంకేశ్వర్‌బజార్, సరళాదేవి హట్స్ ప్రభుత్వ పాఠశాలలు నిర్వహించిన బడిబాటలో ప్రధానోపాధ్యాయులు సతీష్‌కుమార్, భగవాన్ దాస్‌నాయక్, ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## కేంద్ర సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలి

**మన్సూరాబాద్, జూన్ 6(ఆంధ్రజ్యోతి):** నిరుపేదల అభ్యున్నతికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని, ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తకు ఉందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ పరిధిలోని శుభం కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కార్యశాల(వర్క్‌షాప్)ను నిర్వహించారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధిలో దూసుకుపోవడంతో పాటు పారదర్శక పాలనతో కొత్త ఒరవడిని సృష్టించిందన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రజల నడుమ నిర్వహించి ఆరోగ్యంపై వారిలో చైతన్యం తీసుకురావాలని పార్టీ నాయకులకు ప్రేమేందర్‌రెడ్డి సూచించారు. అనంతరం మోదీ 11 ఏళ్ల పాలనకు గుర్తుగా పర్యావరణ పరిరక్షణ కమిటీ జిల్లా కన్వీనర్ నాగపరిమల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యశాలలో రంగారెడ్డి జిల్లా ప్రభారి సుభాష్‌చందర్జీ, అసెంబ్లీ కన్వీనర్లు, కార్పొరేటర్లు, డివిజన్ పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు పాల్గొన్నారు.

## ఐదో రోజుకు చేరిన వంద రోజుల యాక్షన్ ప్లాన్



పారిశుధ్య సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న యూపీహెచ్‌సీ వైద్యులు, పాల్గొన్న కమిషనర్

**సరూర్‌నగర్, జూన్ 6(ఆంధ్రజ్యోతి):** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక శుక్రవారంతో ఐదోరోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా శుక్రవారం బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య సిబ్బందికి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కమిషనర్ పి.సరస్వతి ఈ శిబిరాన్ని ప్రారంభించగా స్థానిక యూపీహెచ్‌సీ వైద్యుల బృందం వారికి పలు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం 14వ డివిజన్‌లోని వెంకటాపూర్‌లో పరిసరాల పరిశుభ్రత, తడిపొడి చెత్త వేరు చేయడం, నిల్వనీటి క్లోరినేషన్, వీధి వ్యాపారం నిర్వహణ వంటి పలు అంశాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కార్పొరేషన్‌లోని అన్నివిభాగాల అధికారులు, సిబ్బంది వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగస్వాములవుతున్నారని అన్నారు. మునిసిపల్ అదనపు కమిషనర్ వి.శ్యాంసుందర్, మేనేజర్ బి.నాగేశ్వర్‌రావు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వి.యాదగిరి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, డీఈఈ వెంకన్న, పర్యావరణ అధికారి మౌనిక, మెప్మా అధికారి శంకర్ పాల్గొన్నారు.

## గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు


సరూర్‌నగర్ పీహెచ్‌సీలో సీమంతం వేడుకలో గర్భిణులను ఆశీర్వదిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటేశ్వర్‌రావు

**ఎల్‌బీనగర్, జూన్ 6(ఆంధ్రజ్యోతి):** గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలనీ, పౌష్టికాహారం తీసుకుంటే పుట్టబోయే బిడ్డ కూడా ఆరోగ్యంగా చురుకుగా ఉంటారని రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం సరూర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కరుణోదయ సొసైటీ ఎన్జీఓ ఆధ్వర్యంలో గర్భిణులకు ఏర్పాటు చేసిన సీమంతం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలింతలు రక్తహీనతకు గురవుతుంటారని పౌష్టికాహారం తీసుకోవడం వల్ల తల్లి, బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. పేద, మధ్య తరగతి గర్భిణులకు కరుణోదయ ఎన్జీఓ సొసైటీ సీమంతం చేయడం అభినందనీయమన్నారు. ప్రతి నెల తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సరూర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అర్చన, డాక్టర్ పూర్ణిమ, ఏఎన్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం


ఇటీవల ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సన్మానించిన కళాశాల ప్రిన్సిపాల్ రేణికుంట్ల అనురాధ

**ఎల్‌బీనగర్, జూన్ 6(ఆంధ్రజ్యోతి):** ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సరూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులను కళాశాల ప్రినిపాల్ రేణికుంట్ల అనురాధ శుక్రవారం ఘనంగా సన్మానించి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం బీపీసీలో 979 మార్కులు సాధించిన మదిహా తహసీన్, ఎంపీసీలో 958 మార్కులు సాధించిన పి.ధార్తి, సీఈసీలో స్వప్న, హెచ్‌ఈసీలో జ్యోతి, ఒకేషనల్‌లో వి. స్వేత, ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో నాజియా ఖాతున్‌లతో మిగతా గ్రూపులలో ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపక బృందం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు చంద్రయ్య, రామకృష్ణ, మేరి, లలిత, మంజులాదేవి, నవీన్, విజయలక్ష్మి, శేఖరయ్య, వెంకన్న, దుర్గాప్రసాద్, నమ్రతాసింగ్ శ్రీనివాస్, లక్ష్మయ్య, రమేష్, ఏ.శ్రీనివాస్, కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం



**చంపాపేట, జూన్ 6(ఆంధ్రజ్యోతి):** గుర్తు తెలియని మృతదేహాన్ని కంచన్‌బాగ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హఫీజ్‌బాబానగర్‌లోని అల్‌నూర్ మజీద్ సమీపంలో గురువారం రాత్రి 11:30 గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి(65) మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకొని పరిశీలించగా అతను మృతిచెందినట్లు, అతను ముస్లిం కమ్యూనిటీకి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మృతదేహాన్ని ఉస్మానియా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ టి.వినోద్ తెలిపారు.

## తప్పిపోయిన మతిస్థిమితం లేని బాలుడు


మహ్మద్ అబ్దుల్లా

**చాదర్‌ఘాట్, జూన్ 6(ఆంధ్రజ్యోతి):** ఇంట్లో ఎవరూ లేని సమయంలో మతిస్థిమితం సరిగ్గాలేని తన కుమారుడు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదంటూ అతని తండ్రి చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆజంపుర నివాసి మహ్మద్‌మోసిన్ ఆటో డ్రైవర్. 2022లో అతని భార్య అనారోగ్యంతో మృతిచెందడంతో ఇద్దరు పిల్లలు తన వద్దే ఉంటున్నారు. 2023లో కుమార్తె వివాహం చేయగా కుమారుడు మహ్మద్ అబ్దుల్లా(13) పుట్టుకతో మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో ఇంట్లో ఉంటున్నాడు. గురువారం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగొచ్చిన మోసిన్‌కు తన మతిస్థిమితం లేని కుమారుడు అబ్దుల్లా కనిపించలేదు. దీంతో ఆయన కుటుంబీకులు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అబ్దుల్లా తప్పిపోయాడంటూ చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు చాదర్‌ఘాట్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.